క్లుప్తంగా

రహదారి భద్రత జీవితానికి శ్రీరామరక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీఓ శ్రీనివాసులు

కదిరి అర్బన్: రహదారి భద్రత జీవితానికి శ్రీరామరక్ష అని ఆర్టీఓ శ్రీనివాసులు, ఎంవీఐ వరప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కుమ్మరవాండ్లపల్లిలోని స్పేస్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపేటపుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కారు నడిపేటపుడు సీటు బెల్టు ధరించాలన్నారు. అతివేగం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మత్తు పదార్థాలు సేవించి వాహనం నడపకూడదన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో హరీష్ స్కూల్స్ కరస్పాండెంట్ ఎంఎస్ కిరణ్, రూరల్ అప్‌గ్రేడ్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ ఎంవీఐ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఏటీఎల్ మృతి



మహబూబ్ బాషా (ఫైల్)

గాండ్లపెంట: మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయంలో ఏటీఎల్‌గా పనిచేస్తున్న మహబూబ్‌బాషా (47) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం ఛాతీలో నొప్పి రావడంతో ఆయన్ను కుటుంబ సభ్యులు అనంతపురంలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆయన మంగళవారం మృతి చెందారు. మహబూబ్‌బాషాకు భార్య పర్వీన్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏటీఎల్ కుటుంబ సభ్యులకు ఆర్డీటీ సిబ్బంది సానుభూతి వ్యక్తం చేశారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: మండలంలోని సంగాల, దంపెట్ల, గరిశలపల్లి గ్రామాల్లో మంగళవారం కందిలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఏఓ ఓబిరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో ఎంపీఈఓ రవి, ఏఈఓ ఉపేంద్రరెడ్డి, వీఏఏ సునీత, బీమా కోఆర్డినేటర్లు మంజునాథ్, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

బత్తలపల్లి: మండలంలోని గరిశలపల్లి, యర్రాయపల్లి గ్రామాల్లో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. పశువైద్యాధికారి గుర్నాథరెడ్డితో కలిసి బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు పాల్గొని 42 పశువులకు సాధారణ పరీక్షలు చేశారు. 29 పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు, 9,473 పశువులకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. రైతులకు వివిధ సూచనలు, సలహాలను అందించి జాగ్రత్తలు పాటించాలని వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్‌నాయక్, మారుతి, సాయి, మురళి, తిరుపతయ్య, సాయి, నందిని, మురళి, పశువైద్య సహాయకులు, గోపాలమిత్రులు, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



హనుమంతు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న నాయకులు

రామగిరి: విద్యుదాఘాతంతో మృతి చెందిన ఏడుగురాకులపల్లికి చెందిన ఏనుకొండ్ల హనుమంతు కుటుంబానికి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.25 వేలు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రూ.10 వేలను అందించారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు మృతుడి భార్య రామాంజినమ్మకు నగదు అందజేశారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి రమ

రామగిరి: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సంస్థ కార్యదర్శి కార్యదర్శి రమ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె గ్రంథాలయ పన్ను బకాయి వివరాలను తెలుసుకొని, బకాయిలను వెంటనే వసూలు చేయాలని గ్రంథాలయాధికారి వెంకటేష్‌ను ఆదేశించారు.

కనగానపల్లి: గ్రంథాలయ పన్ను సక్రమంగా వసూలు చేసి గ్రంథాలయాల అభివృద్ధి సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ స్థానిక అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. గ్రంథాలయాధికారి గోవిందు పాల్గొన్నారు.

వక్క.. లాభాలు పక్కా

- విస్తరిస్తున్న వక్క తోటలు
- అంతరపంటలకూ అవకాశం
- మొగ్గు చూపుతున్న రైతులు



ఎద్దులవాండ్లపల్లి తండా వద్ద సాగుచేసిన వక్క మొక్కలు



రొళ్ల మండలం గిడ్డబొమ్మనపల్లి వద్ద విరగ్గాసిన వక్క

నల్లమాడ: దీర్ఘకాలిక ఆదాయం తెచ్చిపెట్టే వక్క సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇదివరకు మడకశిర నియోజకవర్గంలో మాత్రమే కనిపించే వక్క తోటలు క్రమేణా ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తున్నాయి. కొత్తగా సాగు చేయాలనుకున్న వారు వక్కకు కేరాఫ్‌గా నిలిచిన మడకశిర ప్రాంతాన్ని సందర్శించి.. అక్కడి రైతుల అనుభవాలను తెలుసుకుంటున్నారు. అంతేకాదు ఆ ప్రాంతం నుంచే ఒక్కో మొక్క రూ.50 ధరతో కొనుగోలు చేస్తున్నారు. మొక్కల రవాణా, సాగు ఖర్చులతో కలిపి ఎకరాకు రూ.60 వేల దాకా పెట్టుబడి అవుతోంది. ఎకరా విస్తీర్ణానికి 400 మొక్కలు అవసరమవుతాయి. వక్క తోటలకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాల్సిన అవసరమే లేదు. నేల సత్తువ కోసం ఏడాదికోసారి ఎరువు లేదా మట్టి వేస్తే సరిపోతుంది. ఏడాదిలో రెండుసార్లు యంత్రంతో గడ్డి తొలగించడం మినహా కలుపు తీతకు కూలీల అవసరం కూడా ఉండదు.

3,543 హెక్టార్లలో వక్క సాగు

జిల్లాలోని 25 మండలాల్లో 3,453 హెక్టార్లలో వక్క తోటలు సాగులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో ప్రధానంగా అమరాపురం 1,037, అగళి 804, గుడిబండ 638, రొళ్ల 714, మడకశిర 127, హిందూపురం 81, చిలమత్తూరు 28 హెక్టార్లలో విస్తరించాయి. ఇంకా నల్లమాడ మండలం ఎద్దులవాండ్లపల్లి తండా, ఓడీచెరువు మండలం కొండకమర్ల, కదిరి రూరల్ మండలం పట్నం తదితర గ్రామాల్లో రైతులు కొత్తగా ప్రయోగాత్మకంగా వక్క సాగు చేశారు.

రెట్టింపు ఆదాయం..

వక్క సాగు చేసిన ఆరేళ్లకు దిగుబడి మొదలవుతుంది. తొలుత మొక్క సరాసరి రెండు కిలోల చొప్పున దిగుబడినిస్తాయి. క్రమేపీ దిగుబడి పెరుగుతుంది. మామిడి తోటల మాదిరిగానే దాదాపు వందేళ్ల వరకు వక్క దిగుబడి పొందవచ్చు. ఏటా ఎకరం మామిడి తోట ధరకంటే నాలుగైదు రెట్లు అధికంగా వక్క ధర పలుకుతుందని రైతులు చెబుతున్నారు.

అంతర పంటలకూ అనుకూలం

వక్క దిగుబడి వచ్చే ఆరేళ్ల వరకు అంతరపంటగా వేరుశనగ, ఉలవ, పెసర, మొక్కజొన్న సాగు చేసుకోవచ్చు. అనంతరం కూడా పలుచోట్ల వక్క తోటల్లో అంతరపంటగా తమలపాకు సాగుచేసి రైతులు లబ్ధి పొందుతున్నారు. టెంకాయ చెట్ల వలె వక్క తోటలు ఏపుగా పెరగడం వల్ల మంచిగాలి, వాతావరణంతో పాటు వర్షాన్ని ఆకర్షిస్తాయని రైతులు అంటున్నారు.

ప్రోత్సాహం అందించాలి



వక్క సాగుతో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుంది. సాగు నీటి సమస్య పెద్దగా ఉండదు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరింత మంది రైతులు వక్కతోటలు సాగుచేసే అవకాశం ఉంది. రాయితీపై ఎరువులు, మినీ ట్రాక్టర్లు అందించాలి.

– రమణానాయక్, రైతు, ఎద్దులవాండ్లపల్లి తండా, నల్లమాడ మండలం

కేంద్ర మంత్రి దృష్టికి ధర్మవరం పట్టు చీరల విశిష్టత



కేంద్ర మంత్రికి వివరిస్తున్న ధర్మవరం డిజైనర్ నాగరాజు

ధర్మవరం రూరల్: న్యూఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్, 5 జన్‌పథ్ వద్ద జరిగిన హ్యాండ్‌లూమ్ కార్యక్రమంలో మంగళవారం ధర్మవరం పట్టుచీరల డిజైనర్ నాగరాజు పాల్గొన్నారు. ముఖ్య అతిథి కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు ధర్మవరం పట్టు చీరల విశిష్టతను డిజైనర్ వివరించారు. పట్టు చీరల తయారీకి ప్రస్తుతం వినియోగిస్తున్న సాంకేతిక పరికరాలు, జాకార్డ్ లిఫ్టింగ్ మెషీన్, కంప్యూటర్ ఎలక్ట్రానిక్ జాకార్డ్ తదితర అధునాతన పరికరాల గురించి తెలిపారు.

అడవులను రక్షించండి



బహుమతి ప్రదానం చేస్తున్న అటవీ శాఖ అధికారులు

ఓడీచెరువు : గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటవీశాఖ అధికారులు విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి బుక్కపట్నం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ యామినీ సరస్వతి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులకు నిప్పు పెట్టడం వలన కలిగే నష్టాలు, అడవుల సంరక్షణ బాధ్యత గురించి తల్లిదండ్రులకు, తోటి వారికి తెలియ చెప్పాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంద్ర నాయక్, కొండకమర్ల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామకృష్ణ, రాహుల్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు .

న్యాయవ్యవస్థ, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది బాలసుందరి

తాడిమర్రి: మహిళలు నాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ధర్మవరం సీనియర్ న్యాయవాది వీజీ బాలసుందరి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ధర్మవరానికి చెందిన పలువురు న్యాయవాదులు ఎంపీడీఓ వెంకటరంగారావు, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, సీడీపీఓ సరస్వతి తదితర అధికారులతో కలసి మంగళవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలసుందరితో పాటు పలువురు మహిళా న్యాయ వాదులు మాట్లాడుతూ అత్యాచార ఘటనల్లో బాధిత మహిళలకు చట్టపరమైన సహాయ సహకారాలపై పూర్తి అవగాహన పెంచుకవాలన్నారు. అత్యాచారాలు, దాడులకు గురైన మహిళలకు కోర్టులు ఉచిత న్యాయ సహాయం అందిస్తాయని తెలిపారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి.భార్గవి, పవన్ కుమార్, ఏపీఎం సాంబశివుడు, ఎఫ్‌పీఓ హరిప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగావకాశాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ

పుట్టపర్తి అర్బన్: నర్సింగ్ చదివిన యువతీ యువకులు విదేశాల్లో ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి సమీపంలోని విజ్ఞాన్ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ స్కిల్ ఇంటర్‌నేషనల్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రోగ్రాంలో జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ పూర్తి చేసిన విద్యార్థినులకు ఉచిత శిక్షణ అందిస్తారన్నారు. గల్ఫ్ దేశాల్లో డైరెక్ట్ ప్లేస్‌మెంట్స్‌తో పాటు ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాలో ప్రముఖ ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాల గురించి క్షుణ్ణంగా వివరించారు. విదేశీ ఉద్యోగాలకు వెళ్లే విద్యార్థులకు జర్మన్ భాషపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోరంజని, ఏడీఎస్‌డీఈ చైతన్య, సీడాప్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: గ్రామీల్లో గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి ఫ్యాక్షన్ ప్రభావిత రేగాటిపల్లిలో గ్రామ సభ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతు ఫ్యాక్షన్ క్షలు, గొడవల వల్ల కుటుంబాల్లో ప్రశాంతత ఉండదన్నారు. ముఖ్యంగా పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. గొడవలకు స్వస్తి చెప్పి పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్లే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. మద్యం, జూదం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సైబర్ వలలో పడకుండా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కదిరి సీఐపై చర్యలు తీసుకోండి



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: ప్రజాప్రతినిధి అండతో రెచ్చిపోయి సివిల్ మ్యాటర్‌లో తలదూర్చి నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసిన కదిరి టౌన్ సీఐ నారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీరత్నను కలిసి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటినుంచి దళితులపై అక్రమ కేసుల, దాడులు దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కదిరిలో దళిత నాయకుడు గుడిసె దేవానంద్, షేక్ నస్రీన్‌భాను మధ్య స్థల వివాదం ఉందని, ఈ విషయంలో పరస్పరం ఫిర్యాదులు చేసుకోగా.. సీఐ ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడి మేరకు నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి అక్కులప్ప, జిల్లా ప్రెసిడెంట్ బండారు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణతో అధిక ఆదాయం



పశువుకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్

తాడిమర్రి: వ్యవసాయంతో పాటు పశుపోషణ చేపడితే అధిక ఆదాయం సాధించవచ్చని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ రైతులకు సూచించారు. పెద్దకోట్లలో మంగళవారం పశు వైద్యాధికారి స్వర్ణలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పశుపోషణకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. పశుపోషణ చేపట్టిన రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందిస్తోందన్నారు. ఈ క్రమంలో పశువుల ఆరోగ్యం, ఉత్పాదకతను పెంచడానికి వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. వైద్య శిబిరంలో ఎదకు రాని, చూలు కట్టని, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం అందించామన్నారు. ఈ సందర్భంగా 5,200 సన్నజీవాలు, 62 పశువులు, 34 దూడలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాడి రైతులు, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

మోడల్ పేపర్ల పంపిణీ



మోడల్ పేపర్లు అందజేస్తున్న నాయకులు

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లి, తుమ్మలబైలు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన మోడల్‌పేపర్లను మంగళవారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ మోడల్ పేపర్లను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సరళ, పీటీఎం మురాద్‌షావలి, యూటీఎఫ్ నాయకులు మల్లికార్జున, రమణానాయక్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధుల సర్వే పక్కాగా చేపట్టాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా సమన్వయాధికారి నివేదిత

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా వ్యాధులపై సర్వే పక్కాగా చేపట్టాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ జిల్లా సమన్వయాధికారి డాక్టర్ నివేదిత వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలో చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని జామియా మసీదు వీధిలో ఓ ఇంటికి వెళ్లి సర్వే చేశారు. అసాంక్రమిక వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాబాఫక్రుద్దీన్, హెచ్ఈ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, ఫార్మసిస్ట్ ప్రసాద్, ఎల్‌టీ శారద, స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


పొగాకు రహిత ప్రాంతంగా మారుద్దాం



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కదిరి టౌన్: పొగాకు రహిత ప్రాంతంగా కదిరి పట్టణాన్ని మారుద్దామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పిలుపునిచ్చారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు నుంచి గర్ల్స్ హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్ నివేదిత మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200 జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు అమ్మరాదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనురాధ, టీబీ శ్రీనివాసులు, టీబీహెచ్‌వీ పద్మావతి, సీఓ వనజ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి



కృష్ణవేణమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, నాయకులు

కనగానపల్లి: మామిళ్లపల్లిలో సర్పంచ్ ఓబిరెడ్డి మరదలు ప్యాదిండి కృష్ణవేణమ్మ (56) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తండ్రి, వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి గ్రామానికి వెళ్లి కృష్ణవేణమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అమరనాథరెడ్డి, గంగుల సుధీర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ విడుదల



క్యాలెండర్ విడుదల చేస్తున్న డీఈఓ, నాయకులు

పుట్టపర్తి టౌన్: ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ముద్రించిన 2025 క్యాలెండర్‌ను మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లాజర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటిక జయరాం ఆధ్వర్యంలో డీఈఓ కృష్ణప్ప చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో బండారు శ్యామ్, సురేష్ నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



ట్రోఫీ చూపుతున్న శిరిపి వెంకటేష్

ధర్మవరం రూరల్: జాతీయస్థాయి కరాటే పోటీల్లో ధర్మవరానికి చెందిన శిరిపి వెంకటేష్ ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 25 నుంచి 26 వరకు తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా ఇడప్పడిలో రెండవ ఆలిండియా ఓపెన్ క్యుకు సీన్ ఫూల్ కాంటాక్ట్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. 56 – 62 కేజీల విభాగంలో పాల్గొని బ్లూ బెల్ట్‌లో జాతీయ స్థాయిలో మూడో స్థానం కైవసం చేసుకున్నాడు. ప్రతిభ కనబరిచిన శిరిపి వెంకటేష్‌ను గురువు శివరామిరెడ్డితో పాటు పలువురు మంగళవారం అభినందించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

నల్లచెరువు: ఉత్తమ అవార్డు అందుకున్న అందుకున్న ఎంపీడీఓ రఘునాథగుప్తా, టైపిస్టు శ్రీనివాసులు, ఉపాధిహామీ టీఏ గంగాధర, పంచాయతీ కార్యదర్శి కిషోర్ బాబును ఎంపీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణస్వామి, ఎంపీటీసీలు నరసిహారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పునఃపరిశీలన



వికలాంగుల పింఛన్ అర్హతలను పరిశీలిస్తున్న వైద్య బృందం, అధికారులు

ఎన్‌పీకుంట: మండలంలోని ధనియానిచెరువు, ఎన్.పీ.కుంట-1, 2, పి కొత్తపల్లి, పెడబల్లి సచివాలయాల పరిధిలో ఎన్టీఆర్ భరోసా కింద రూ.15వేల పింఛన్ పొందుతున్న 14 మంది అర్హతలను మంగళవారం వైద్య బృందం పునఃపరిశీలన చేసింది. బుధవారం మిగిలిన గ్రామాల్లో 17 మంది అర్హతల పరిశీలన చేయనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ మాధవరెడ్డి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల ఆరోగ్యస్థితిపై విచారణ

చెన్నేకొత్తపల్లి: పింఛన్‌దారుల్లో మంచానికి పరిమితమైన వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ల బృందం విచారణ చేపట్టింది. విచారణ నిమిత్తం వచ్చిన డాక్టర్ రాఘవేంద్రరాజ్, డాక్టర్ ఇమ్రాన్‌బాషా, మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ మేడాపురం, గంగినేపల్లి, బసంపల్లి, నామాల తదితర గ్రామాల్లోని పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి వారిని పరీక్షించారు. డాక్టర్ల బృందంతో పాటు ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఆర్డీఓ

ధర్మవరం రూరల్/ముదిగుబ్బ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆర్డీఓ మహేష్ మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం ధర్మవరం మండలం నడిమిగడ్డపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు గురించి ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు కళావతితో ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ముదిగుబ్బ మండలం గాండ్లవారిపల్లి ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి.. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలపై ఆరా తీశారు.

పొలం సమస్యపై విచారణ

ముదిగుబ్బ మండలం ముక్తాపురంలో 636-1 సర్వే నెంబర్‌లోని బిల్లే పెద్దన్న ఇటీవల పొలం సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఆర్డీఓ మంగళవారం ముక్తాపురం వెళ్లి విచారణ చేపట్టారు. రాఘంపల్లిలో రస్తా వివాదంపైనా విచారణ చేశారు. గ్రామ ప్రజల ఆధ్వర్యంలో రస్తా వివాదాన్ని పరిష్కరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
8008554500, 9912220726
9010593486, 9912220717